క్లుప్తంగా

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం


పదో తరగతి విద్యార్థినులకు సూచనలు చేస్తున్న జీసీడీఓ మాలతి

లక్కవరపుకోట: కస్తుర్బా గాంధీ బాలికల పాఠశాల(కేజీబీవీ)ల్లోని పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులు పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పంచతంత్ర ప్రణాళికతో బోధన చేస్తున్నట్లు జీసీడీఓ పి.మాలతి తెలిపారు.మండల కేంద్రంలోని కేజీబీవీని సోమవారం ఆమె సందర్శించారు.విద్యాలయంలో వసతులను పరిశీలించారు. 10వ తరగతి,ఇంటర్ విద్యార్థినుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించి, పలు సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని కేజీబీవీల నుంచి ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలకు 975 మంది, ఇంటర్ ప్రథమ సంవత్సరం 880 మంది, ద్వితీయ సంవత్సరం 658 మంది విద్యార్థినులు హాజరు కానున్నట్లు చెప్పారు. ఆమె వెంట కేజీబీవీ ఎస్ఓ ప్రవీణ ఉన్నారు.

ఘనంగా పంబావిళక్కు ఉత్సవం


పంబావిళక్కు ఉత్సవంలో స్వాములు

శృంగవరపుకోట: స్థానిక శ్రీనివాసకాలనీలోని శ్రీమణికంఠ ధర్మశాస్తా పీఠంలో అయ్యప్ప మాలధారణ భక్తులు పంబావిళక్కు ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గురుస్వాముల నేతృత్వంలో స్వాములు ఆదివారం భిక్షాటనలో తెచ్చిన దినుసులతో వంటచేసి, స్వాముల భిక్ష పూర్తయిన తర్వాత విస్తర్లలో గురు స్వామి పాదపూజ్లదండాలు చేశారు. అనంతరం కాలనీవాసులకు అన్నదానం చేశారు. సాయంత్రం అయ్యప్ప స్వామికి పల్లకీ సేవ నిర్వహించారు.మేళతాళాల నడుమ, స్వాములు శరణుఘోష చేస్తూ, పేటతుళ్లి ఆడుతూ ఎస్.కోట నుంచి శివరామరాజుపేట కోనేరు వరకూ ఊరేగించారు. అనంతరం స్వామి పల్లకిని కోనేరులో వదిలారు. ఉత్సవంలో అయ్యప్ప, గణపతి, మహాలక్ష్మి, కాళీమాత వేషధారణలతో ఉన్న మణికంఠ స్వాములు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

కృత్రిమ అవయవాల పంపిణీ


దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందజేస్తున్న దాతలు

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామ సమీపంలో గురుదేవ చారిటబుట్ ట్రస్టు ఆధ్వర్యంలో విశాఖపట్నానికి చెందిన గ్లోబల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ భూపతిరాజు పండేటి, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జి సహకారంతో 50 మంది దివ్యాంగులకు సోమవారం కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. ముందుగా దాతలు ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కృత్రిమ అవయవాల తయారీ యూనిట్, నిర్మాణంలో ఉన్న వంద పడకల క్యాన్సర్ ఆస్పత్రిని పరిశీలించారు. ట్రస్టు సహకారంతో 70 మంది అంధులకు రూ.500 చొప్పున పెన్షన్ అందజేశారు. దాతలు మాట్లాడుతూ గురుదేవ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు తన జీవితాన్ని దివ్యాంగుల సేవకే అంకితం చేశారని, ఆయన్ని ఆదర్శంగా తీసుకుని దివ్యాంగులకు సేవ చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ట్రస్టు వైస్ చైర్మన్ వి.ఫణీంద్ర, డాక్టర్ రాఘవేంద్ర, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ సందర్శన


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ-2 బాలభాస్కరరావు

వేపాడ: బక్కునాయుడుపేట కేజీబీవీని ఎంఈఓ-2 బాలభాస్కరరావు సోమవారం సందర్శించారు. పదోతరగతి విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. అపార్ కార్డుల అప్‌లోడ్‌పై ఉపాధ్యాయినులను ఆరా తీశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

నేత్ర వైద్య శిబిరం


వృద్ధుడికి కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్

చీపురుపల్లి: మండలంలోని కర్లాం గ్రామంలో మానవీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు శిబిరంలో 66 మందికి నేత్రపరీక్షలు చేసి, 27 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. శస్త్రచికిత్సలకు గుర్తించిన వారికి పుష్పగిరి కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్‌లు చేయనున్నట్లు మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బి.వి.గోవిందరాజులు తెలిపారు.

- అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం
- మామిడి, జీడి తోటల్లో వరి, కూరగాయల పంటలను సాగుచేస్తున్న రైతులు

అంతర సాగు.. లాభాలు బాగు..


రేగ గ్రామంలో మామిడి తోటలో అంతర పంటగా వరిసాగు


వేచలపూడివానిపాలెంలో మామిడితోటలో వరి సాగు


గేదెలవానిపాలెంలో మామిడితోటలో అంతర పంటగా బెండ సాగు

లక్కవరపుకోట:

పంటల సాగులో రైతులు పంథా మార్చారు. ఒక వ్యవసాయ క్షేత్రంలో ఒక పంటనే సాగు చేయడం వల్ల ఆ పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రాకుంటే పెట్టుబడి వృథా అవుతోందని, అదే వ్యవసాయ క్షేత్రంలో అంతర పంటలు సాగు చేస్తూ తద్వారా వచ్చే ఆదాయంతో నష్టాన్ని పూడ్చవచ్చని రైతులు అంటున్నారు. ఎస్.కోట నియోజక వర్గంలోని రైతులు మెట్ట ప్రాంతాల్లోని మామిడి,జీడి తోటల్లో అంతర పంటలు సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. జామి మండలంలోని జట్టేడవలస, రామభద్రపుర అగ్రహారం, కొత్తవలస మండలంలోని చీడి వలస, రామలింగాపురం, లక్కవరపుకోట మండలంలోని రేగ, చందులూరు, గేదెలవానిపాలెం, శ్రీరామపురం తదితర గ్రామాల రైతులు సుమారు 300 ఎకరాల్లో అంతర పంటలను సాగు చేస్తున్నారు. వరితో పాటు వేరుశనగ, పెసర, కంది, మినప పంటలతో పాటు బెండ,బీర, చిక్కుడు,ఆనప, తదితర కూరగాయల పంటలను సాగుచేస్తున్నారు. అంతర పంటగా తేలిక రకం వరి వంగడాలను సాగు చేస్తున్నామని, ఎకరానికి సుమారుగా 22 నుంచి 25 బస్తాల వరకు ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.అలాగే కూరగాయలు, అపరాల పంటల ద్వారా సుమారు రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు ఆదా యం వచ్చే అవకాశం ఉందంటున్నారు. వీటికి తోడు ఆ వ్యవసాయ క్షేత్రంలోని ప్రధాన పంట అయిన మామిడి, జీడి తోటల ఫలసాయం ద్వారా రూ.30వేల వరకు ఆదాయం వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

పెట్టుబడి తక్కువే..

గత ఏడాది నుంచి మామిడి తోటల్లో వరి పంటను సాగు చేస్తున్నాను. ఎకరానికి సుమారు 20 బస్తాల ధాన్యాన్ని పండి స్తున్నాను. పెట్టుబడి కూడా పల్లం భూముల్లో సాగుచేస్తున్న వరిపంటతో పోల్చుకుంటే మూడింతలు తక్కువే.
– బి.అప్పలనాయుడు, రైతు, రేగ గ్రామం, ఎల్.కోట మండలం

అదనపు ఆదాయం

అంతర పంటలగా వేరుశనగ, కర్రపెండలం, పెసర, మినప పంటలను సాగు చేస్తున్నాం. ఈ పంటల సాగు వల్ల అదనపు ఆదాయం వస్తోంది.వ్యవసాయ శాఖ అధికారులు అంతర పంటల సాగుకు సూచనలు, సలహాలు అందించడంతో పాటు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే మరింత లాభాలను ఆర్జిస్తాం.
– గుల్లిపల్లి అప్పలరాజు, రైతు, శ్రీరామపురం, ఎల్.కోట మండలం.

శంభో శివ శంభో

కార్తీకమాసంలో రెండో సోమవారం కావడంతో చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జామున 4 గంటల నుంచే పరమ శివున్ని దర్శించుకునేందుకు భక్తులు ఆలయాల వద్ద బారులు తీరారు. అర్చకులు భక్తులతో శివలింగాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ఆవరణలోని నంది విగ్రహాలు, తులసి కోటలు, ధ్వజ స్తంభాల వద్ద మహిళలు దీపారాధన చేశారు. – సాక్షి నెట్‌వర్క్


చీపురుపల్లి: చీపురుపల్లిలో పూజలందుకుంటున్న ఉమానీలకంఠేశ్వరస్వామి


కొత్తవలస: పాతసుంకరపాలెం శివాలయంలో పూజలు చేస్తున్న మహిళలు


జామి: త్రిపురాంతకస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు


లక్కవరపుకోట: ఎల్.కోటలో పూజలందుకుంటున్న వీరభద్రస్వామి


గుర్ల: గుర్ల శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


కొత్తవలస: తుమ్మికాపల్లి గేటు సమీపంలోని శివాలయంలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు


చీపురుపల్లి: చీపురుపల్లిలోని ఉమానీలకంఠేశ్వరస్వామి దేవస్థానంలో తెల్లవారు జామున క్యూలో ఉన్న భక్తులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాల్ బాడ్మింటన్, త్రోబాల్, బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం వెంకటరావు తెలిపారు. అండర్–14 బాలుర, బాలికల విభాగంలో బాల్ బాడ్మింటన్‌కు బి.యశ్విన్, సీహెచ్ వంశీ, ఎస్.జ్ఞానప్రసన్న, అండర్–17 విభాగంలో త్రోబాల్ పోటీలకు టి.లోకేష్, అండర్– 19 విభాగంలో బాస్కెట్‌బాల్ పోటీలకు పి.కుమా ర్, టి.లోకేష్, ఎల్.అంజలి ఎంపికయ్యారు. విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు పీడీ ఎం.అవతారం, ఉపాధ్యాయులు అభినందించారు.

అకారణంగా వీఓఏను తొలగిస్తే సహించం


ఏపీఎం నారాయణరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, గ్రామైక్య సంఘ సభ్యులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని అర్తమూరు గ్రామానికి చెందిన వీఓఏ అంబళ్ల గౌరి తప్పు చేయకపోయినా, అకార ణంగా తొలగించి, వేరొకరిని నియమించాలని అధికారులు చూస్తున్నారని, అలా చేస్తే సహించేది లేదని ఆ గ్రామ గ్రామైక్య సంఘ సభ్యు లు వెలుగు అధికారులను హెచ్చరించారు. డ్వాక్రా సంఘాల సభ్యులు, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, సర్పంచ్ పొన్నాడ కుమార్,ఎంపీటీసీ పతివాడ గురునాయుడు, ఎస్‌ఎంసీ చైర్మన్ బూడి శ్రీనివాసరావుతో కలిసి గరివిడి వెలుగు కార్యాలయంలో ఏపీఎం నారాయణరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2019లో మహంతి సరస్వతి వీఓఏ బాధ్యతల నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్నారని, ఆమె స్థానంలో గౌరీని నియమించారని అన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా సేవలు అందిస్తున్న గౌరిని తప్పించాలని చూడడం సరికాదని, వీఓఏగా ఆమెనే కొనసాగించాలని కోరారు.

ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోండి


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ప్రేమలత

చీపురుపల్లి: జాతీయ న్యాయ సేవల అథారిటీ ద్వారా అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి వై.ప్రేమలత సూచించారు. జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కోర్టు హాల్‌లో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్‌అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకోవచ్చని చెప్పారు. పేదల కోసం ఉచిత న్యాయ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 1987లో లీగల్ సర్వీసెస్ అథారిటీస్ చట్టం అమల్లోకి వచ్చిందని, జాతీయ న్యాయ సేవల అథారిటీ ద్వారా ఉచిత న్యాయ సహాయం, సలహాలు, సామరస్యం ద్వారా కేసులను పరిష్కరించడం వంటి కార్యకలాపాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

- ప్రశ్నించే వారి గొంతు నొక్కేందుకు ప్రభుత్వం ప్రయత్నం
- కక్ష సాధింపు చర్యలే తప్ప పథకాల అమలు, అభివృద్ధి ఊసేలేదు
- గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యలను మానుకుని, ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర సయ్య అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నా యకులు సూపర్ సిక్స్‌తో పాటు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని,తీరా అధికారం వచ్చాక వాటిని పూర్తిగా విస్మరించి, కక్ష సాధిం పు చర్యలకు కంకణం కట్టు కున్నారని మండిపడ్డారు. సూపర్ సిక్స్ పథకాలను ఎప్పుడు అమలు చేస్తారని నిలదీస్తో న్న సోషల్ మీడియా కార్యకర్తలు, సామా న్యుల గొంతు నొక్కడమే లక్ష్యంగా ప్రభుత్వం కేసులు నమోదు చేయిస్తోందని, ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎత్తి చూపే వారిని అన్యాయంగా,అక్రమంగా నిర్బం ధించి, హింసించడం బాధాకరమ న్నారు. ప్రజా స్వామ్యాన్ని అభాసుపాలు చేసే లా చంద్రబాబునాయుడు పరిపాలన కొనసాగుతోందన్నారు. ఎప్పుడో ముగిసిపోయిన పాత కేసులను తిరగదోడి పోలీసుల ద్వారా వైఎస్సార్ సీపీ నాయకులను, సోషల్ మీడియా కార్యకర్తలను అక్రమ అరెస్ట్ చేయిస్తున్నారని మండిపడ్డారు. తమని ఎవరూ ప్రశ్నించకూడదనే ధోరణి సీఎం చంద్రబాబు చేష్టల్లో కనిపిస్తోంద న్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక చిన్నారులపై అత్యాచారాలు, హత్యలు, అఘాయిత్యాలు పెరిగిపోయాయని, ప్రభుత్వం వాటిని అదుపు చేయడంపై దృష్టి పెట్టకుండా, వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్ చేసి కేసులు పెట్టడమే పనిగా పెట్టుకుని, డైవర్షన్ పాలిటి క్స్ చేస్తోందని ఆరోపించారు. గ్రామాల్లో పుట్టగొడు గుల్లా బెల్టు షాపులు వెలుస్తున్నాయని, మద్యం ఏరులై పారుతోందన్నారు. బెల్టు షాపులు ఏర్పాటు చేస్తే తొక్క తీస్తామని చంద్రబాబు స్టేట్ మెంట్లు ఇస్తున్నా...టీడీపీ వారే విచ్చల విడిగా బెల్టు షాపులు నడుపుతున్నారన్న విషయం ఆయనకూ తెలుసని అన్నారు.

అభివృద్ధి చేద్దామనే ఆలోచన లేదు

మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు జిల్లాపై ఎటువంటి పట్టు లేదని, జిల్లాను అభివృద్ధి చేద్దామనే ఆలోచన లేదని అప్పలనరసయ్య అన్నారు.గజపతినగరం నియోజకవర్గంలో తమ ప్రభుత్వం హయాంలో ప్రారం భించిన ప్రభుత్వం డిగ్రీ కళాశాల, 100పడకల ఆస్పత్రి భవన నిర్మాణాలను పూర్తి చేయించాలనే ఆలోచన లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో 113 మంది ప్రభుత్వ ఉద్యోగు లను బదిలీ చేశారని, బదిలీ అయిన వారి స్థానాలను భర్తీ చేయలేకపోవడం మంత్రి అనుభవ రాహిత్యానికి నిదర్శనమన్నారు. జెడ్పీటీసీ గార తవుడు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనా యుడు, దత్తిరాజేరు ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, గజపతినగర మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బూడి వెంకటరావు, పార్టీ సీనియర్ నాయకు లు బెల్లాన త్రినాథరావు, మంత్రి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పరిశుభ్రతతో వ్యాధులకు చెక్


చినకాదలో సర్వే చేస్తున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

దత్తిరాజేరు: పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే చాలావరకు వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ అన్నారు. పారిశుధ్య నిర్వహణ సర్వేలో భాగంగా పోరలి, చినకాద, గడసాం గ్రామాల్లో సోమవారం ఆయనపర్యటించి, వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, పారిశుధ్య పనుల నిర్వహణను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పాఠశాలకు పుస్తకాల అందజేత

మెరకముడిదాం: చినబంటుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో లైబ్రరీ నిర్వహణకు హైదరాబాద్‌కు చెందిన బాలమిత్ర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బుద్ధ రాజురామరాజు 100 పుస్తకాలను సమకూర్చారు. హెచ్‌ఎం ఆల్తి రాంబాబుకు సీఆర్‌ఎంటీ రెడ్డి శంకరరావు బాలమిత్ర ఫౌండేషన్ తరఫున సోమవా రం పుస్తకాలను అందజేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థుల్లో పుస్తకపఠనంపై ఆసక్తి పెంచేందుకు బాలమిత్ర ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినంద నీయమన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

దత్తిరాజేరు: ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కె.కొత్తవలస పీహెచ్‌సీలో వైద్యాధికారి స్రవంతి సోమవారం 45మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి, వారు పాటించాల్సిన జాగ్రత్తలను సూచించారు. క్రమం తప్పకుండా తనిఖీలు చేయించుకోవాలని, విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు.

అన్నదానం

చీపురుపల్లిరూరల్(గరివిడి): కార్తీక మాసం నేపథ్యంలో గరివిడి పట్టణంలోని ఫేకర్ రోడ్డులో లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం చేశారు. గరివిడి పట్టణంతో పాటు, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఇతర శాఖల విధులను అప్పగించొద్దు


తహసీల్దార్ రాములమ్మకు వినతి పత్రం అందజేస్తున్న వీఆర్‌ఓలు

వేపాడ: తమకు ఇతర శాఖల విధులను అప్పగించవద్దంటూ మండల వీఆర్‌ఓలు తహసీల్దార్ రాములమ్మకు సోమవారం వినతిపత్రం అందజేశారు. నీటి సంఘాలకు సంబంధించిన ఓటర్ల జాబితా తయారు చేయడం, రెవెన్యూ గ్రామసభలు, జనరల్ ఓటర్ల జాబితా తయారీ, ఇంటింట సర్వే, తదితర విధులు నిర్వర్తిస్తున్నామని, అదనంగా వేరే శాఖ విధులు కేటాయించడం వల్ల పని ఒత్తిడితో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. జిల్లా కలెక్టర్, సీసీఎల్‌ఏ ఇచ్చిన ఆదేశాలను కిందస్థాయిలో అమలయ్యేలా అన్ని డిపార్టమెంట్లకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

15న పీడీఎస్‌ఓ సదస్సు

గజపతినగరం: జిల్లా కేంద్రంలో ఈనెల 15న ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సును పీడీఎస్‌ఓ(ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆసంఘం జిల్లా సెక్రటరి బి.రాకేష్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదస్సులో విద్యారంగ సమస్యలు, వలసలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఎయిడెడ్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగించడంతో పేద విద్యార్థులు నష్టపోతున్నారని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుకు అప్పగించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు.

క్రీడాపరికరాల వితరణ


హెచ్‌ఎం ఎల్లంనాయుడుకు క్రీడాపరికరాలు అందజేస్తున్న సన్యాసినాయుడు

మెరకముడిదాం: స్థానిక ఉన్నతపాఠశాలకు ఊటపల్లి గ్రామానికి చెందిన విలేజ్‌మైండ్స్ ఐటీ సాఫ్ట్‌వేర్ కంపెనీ యాజమాన్యం సుమారు రూ.50 వేల విలువ చేసే క్రీడాపరికరాలు, టీషర్టులు సమకూర్చింది.విలేజ్‌మైండ్స్ ఐటీ సాఫ్ట్‌వేర్ కంపెనీ చైర్మన్ సంగంరెడ్డి భానుమూర్తి, కార్యనిర్వహణ అధికారి గాయత్రీ వెంకటేషన్ తరఫున భానుమూర్తి తండ్రి సన్యాసినాయుడు హెచ్‌ఎం కోట్ల ఎల్లంనాయుడుకు క్రీడాపరికరాలు, టీషర్టులను సోమవారం అంద జేశారు. దాతలకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

బెల్టు షాపుల నిర్వాహకులపై బైండోవర్ కేసులు

చీపురుపల్లి: బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ సీహెచ్.చక్రవర్తి చెప్పారు. సోమవారం తహసీల్దార్ ఎస్.రాజారావు ఎదుట 11మందిని హాజరుపరిచి బైండోవర్ కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సెప్టెంబర్ నెల నుంచి ఇంతవరకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో 187 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని 11 కేసులు నమోదు చేశామన్నారు. చీపురుపల్లి, గరివిడి మండలాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్న నలుగురిపై కేసులు నమోదు చేశామని, వారిపై తహసీల్దార్ సమక్షంలో బైండోవర్ కేసులు కట్టామని చెప్పారు.

ఎనర్జీ అసిస్టెంట్లను రెగ్యులర్ చేయాలి


ఆర్‌ఈసీఎస్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లు

చీపురుపల్లి: గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (ఆర్‌ఈసీఎస్) పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లను తక్షణమే రెగ్యులర్ చేయాలని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాలకు చెందిన ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మూడు మండలాల్లో పని చేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లు సోమవారం స్థానిక ఆర్‌ఈసీఎస్ ప్రధాన కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడున్నర సంవత్సరాలుగా ఆర్‌ఈసీఎస్ పరిధిలో ఎనర్జీ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్నామని, ఇంతవరకు తమను రెగ్యులర్ చేయలేదన్నారు. ఇదే విషయమై గతంలో ఎన్నోసార్లు ఆర్‌ఈసీఎస్ ఎండీని కలిసి వివరించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. సచివాలయ వ్యవస్థలో తమతో పాటు విధుల్లో చేరిన వారంతా రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తింపు పొందారని ఆర్‌ఈసీఎస్‌లో చేరిన తాము మాత్రమే రెగ్యులర్‌కు నోచుకోలేకపోయామన్నారు. తక్షణమే ఎండీ స్పందించి తమను రెగ్యులర్ చేయాలని కోరారు.

పారిశుధ్య నిర్వహణపై సర్వే


బొండపల్లి: దేవుపల్లిలో సర్వే చేస్తున్న డీపీఓ వెంకటేశ్వరరావు

బొండపల్లి: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) టి.వెంకటేశ్వరరావు పంచాయతీ సిబ్బంది, అధికారులకు సూచించారు. మండలంలోని కనిమెరక,దేవుపల్లి పంచాయతీల్లో సోమవారం ఆయన పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణపై సోమవారం చేపట్టిన సర్వేతో పాటు పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత అధికారు లపై ఉందన్నారు. అలాగే మురుగునీటి కాలువల నిర్వహణ పక్కాగా ఉండాలని, తాగునీటి వనరుల చుట్టూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట హెచ్‌ఆర్‌డీ కన్సల్టెంట్ టి.సుధాకర్,ఈఓపీఆర్డీ ఏ.రఘుపతిరావు తదితరులున్నారు.

అవగాహన కల్పించండి

గజపతినగరం: ప్రజలు వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించేలా, పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని, పారిశుద్ధ్య నిర్వహ ణపై దృష్టి సారించాలని డీపీఓ వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సరిగా చేపట్టకపోయినా, చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు వినియోగంలో లేకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీఓ బి.కల్యాణి,హెచ్‌ఆర్‌డీ కన్సల్టెంట్ టి.సుధాకర్,ఈఓపీఆర్డీ సుగుణాకర రావు పాల్గొన్నారు.